భార్య గోముగా చూస్తూ... "ఇవ్వాళ లీవ్ పెట్టకూడదా?" అని ప్రాధేయపడేసరికి ఇరకాటంలో పడ్డాడు మల్లేశం.



# మంచివాడు

— సదానంద శారద

ఆఫీస్ గేట్ వాచ్‌మన్ పూలతొట్లు మెట్లు, హాలు ఆఫీసర్ గది దాకా పరుగెత్తింది అతని మనసు.

"మల్లేశంగారినైనా చూసి నేర్చుకోండి – మాటిమాటికి మీలాగే లీవులు పెడ్తున్నాడా? ఆఫీసుకు ఎప్పుడైనా లేటుగా వచ్చాడా?..."

తోటి గుమాస్తాల ముందు తనను ఆఫీసర్ పొగడటం గుర్తుకొచ్చి భార్య కోరిక బంగారు లేడి కంటె ప్రమాదంగా తోచింది మల్లేశంకు-

నెలలు నిండి, ఇవ్వాళో రేపో కనడానికి సిద్ధంగా వున్న భార్య వంక కన్నెత్తి చూడాలంటే భయం వేసింది- ఆఫీసర్‌గారి మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి- 'మల్లేశం మంచివాడండి... సిన్సియర్ వర్కర్...' అది సర్టిఫికెట్ అయితే ఫరవాలేదు- చక్కెర పూత అయితేనే సంకెల!-

ఆఫీసర్‌గారి పొగడ్తలు సంకెళ్ళ మోతలా వినిపించవు మల్లేశంకు-

''పొద్దుట్నించి అదోలా వుందండి- కడుపులో కదలిక ఎక్కువైంది- పిండం జారుతున్నట్లు అనిపిస్తున్నదండి...''

ఆ మాటలు కాళ్ళకు పగ్గం వేస్తున్నాయి- ఆఫీసుకు, ఇంటికి మధ్య మల్లేశం మనసు వూగిసలాడుతోంది-

లీవు పెట్టకపోతే భార్య ఎంత నొచ్చుకుంటుందో!- లీవు పెడ్తే- ఆ రోజు అర్జెంటు పనులున్నాయి... మంచివాడు, సిన్సియర్ అన్న తన రికార్డ్ ఏం కాను?

అసలు క్యాజువల్ లీవులు వున్న దెందుకోయ్? మనసు కాస్సేపు తిరగబడింది- కాని క్షణాల్లోనే మల్లేశం బుజ్జగింపునకు లొంగిపోయింది!

ఆఫీసర్‌గారు నిన్న సాయంకాలం అర్జంట్ ఫైలొకటి పంపించారు- ఇవ్వాళ ఉదయమే నోట్ పుటప్ చేయమన్నారు- లీవు పెడ్తే ఎట్లా?

మల్లేశంగారు రాలేదా!

ఈజిట్!!

అర్జంట్ ఫైరొకటి ఇచ్చావే!...

ఆఫీసర్‌గారి ఎంక్వయిరీ గుర్తుకొచ్చి గిలగిల్లాడిపోయాడు మల్లేశం- ముచ్చెమటలు పోశాయి-

"ప్రైవేట్ నర్సింగ్ హోంలో చేరతాను-" అని దీనంగా అడిగింది భార్య-

తనను ప్రభుత్వ ఆస్పత్రి పాలు చేయొద్దని మొరపెట్టుకుంది- కంట నీరు పెట్టుకుంది-

కళ్ళు మూసుకున్నాడు మల్లేశం- గాలికి వూగే లతలు, తుపానులో చిక్కుకున్న పడవలు కనిపించాయి- బొమ్మకుక్కలు, పంజరాల్లోని రామచిలకలు కనిపించలేదు!

భార్య పట్ల తనకు బోల్డు జాలి వుంది- కోరి తనను చేసుకుంది- కాదన్న తలిదండ్రులను వొదిలి వచ్చేసింది- కష్టమో, సుఖమో గుట్టుగా కాపురం చేస్తోంది- ఇది కావాలని నోరు విడిచి అడగలేదు- ఎన్నడూ తన మాటకు ఎదురు చెప్పలేదు... ఈ రోజు మాత్రం దీనంగా లీవు పెట్టమని అడిగింది- ప్రైవేటు ఆస్పత్రిలో చేరతానన్నది-

* * *

"ఈ నెల కిరాయి ఆపుదాం..." అని సలహా ఇచ్చింది-

'గా మల్లేశంను సూడుండ్లి- ఏ నెలన్న కిరాయి ఇచ్చేకాడ కిరికిరి చేస్తడా. అడుగక ముందే ఫస్ట్ తారీకు రాంగనే తెచ్చిస్తడు- కిరాయికున్నోళ్ళంటె గట్లుండాలె..."

ఓనర్ మాటలు గుర్తుకొచ్చి మరోసారి గిలగిల్లాడిపోయాడు మల్లేశం- ఈ నెల కిరాయి ఇవ్వలేనని, ఖర్చులున్నాయని చెబితే ఆయన ఏమనుకుంటాడు!... 'నువ్వూగింతేనా!' అనుకోడూ?

భార్య సలహా బరువు తగ్గి... తగ్గి... దూది పింజైపోయింది-

ఆ నెల కిరాయి ఇచ్చి వచ్చిన తరువాతగాని మల్లేశం మనసు తేలిక పడలేదు.

"కిరాణా కొట్లో సగమే ఇద్దాం..." అని కూడా చెప్పింది భార్య విమల-

కాని కిరాణా కొట్టును సమీపిస్తుంటె గుండె దడ ఎక్కువయింది... మొహమంతా చెమట పట్టింది మల్లేశంకు-

అడుగులు తడబడుతున్నాయి...

చెప్పవలసిన డైలాగులు ఎదురు తిరుగుతున్నాయి-

"నమస్తే సార్..." కిరాణా కొట్టు యజమానే ముందుగా పలకరించాడు-

"నమస్తే... నమస్తే..." డబుల్ నమస్కారాలు చేశాడు మల్లేశం-

"మీలాంటి మంచివాళ్ళు నూటికో, కోటికో ఒక్కరు వుంటరు సార్... మిమ్మల్ని చూడంగానే ఒకటో తారీఖ ని గుర్తుకొస్తది..."

కొట్టు యజమాని అభిమానపు జల్లులు కురిపించాడు- స్వయంగా స్టూలుమీది దుమ్ము దులిపి మల్లేశంను కూర్చోబెట్టి మర్యాదలు చేశాడు-

గుటకలు మింగుతూ కూర్చున్నాడు మల్లేశం- మూడేండ్ల నుంచి ఆ దుకాణంలో ఖాతా- ఏ నెలా డబ్బు ఆపలేదు-

"గీ నెల జెర తక్లీఫ్‌గ వున్నది- వచ్చే నెల సుక్త కడ్తా..."

ఆ మాటలన్నది మల్లేశం కాదు- మరో ఖాతాదారు!

మాసిన బనీను, అసలు రంగేదో తెలియని లుంగీ... బాధల మడతల్లో చిక్కిన మొహం...

"జెర సౌదలు ఇయ్యుండ్లి..." దీనంగా అడిగాడు-

అతని వంక జాలిగా చూల్లేదు కొట్టు యజమాని! జ్వాలల్లాంటి మాటలన్నాడు-

"ఒగర్ని చూసి ఒగరు- అందరు గిట్లయితే ఇగ మా చేతికి చిప్పే... పోయిన నెలల సగమే కడ్తివి. ఈ నెల అసలే కట్టనంటె ఎట్ల? బేపారమంటె ఏమనుకున్నవ్?..."

"కాదు సేటూ... కార్ఖాన్ల హర్తాల్ నడుస్తాంది- జీతాలు ఎన్క ముందైతానయి... రాంగనె సుక్త కడ్త..."

"మీకు జీతాలు ఎన్నడు సక్కంగ వొచ్చినయ్? ఎన్నడు సక్కంగ కట్టినవ్?... గా బడి పంతుళ్ళ గిట్లనే నెల నెలా సతాయిస్తున్నరు..."

"ఏం జేద్దుం సేటూ... పిల్లలు గల్లోళ్లం..."

"మీ పిల్లలు సల్లగుండ... మధ్యన బేపారస్తులను ముంచుతరా?"

ఆ ఆలోచన ఏ కోశాన లేదు- చావు ఖరీదు పెరిగే పేదవానికి ఈ ఇక్కట్లు! - అన్ని ధరలతో పాటు విషం ఖరీదు కూడా పెరిగిపాయె!! దూకుదామంటె చార్మినార్ కమాన్లకు గ్రిల్లు బిగించి ప్రభుత్వం జాగ్రత్తలు పడుతుండె!!-

"నెల నెల సరింగ కట్టెటోళ్ళకే మా దుకాణ్ల సౌదలు- పాత బాకి సుక్త కట్టి కొంటబో- " ఖచ్చితంగా చెప్పాడు కొట్టు యజమాని-

మల్లేశం టెంపరేచర్ పెరుగుతోంది-

"గీ సార్‌ను చూడు- ఫస్ట్ తారీఖు రాంగనే ఎట్ల కడ్తడో- ఆయనకు మాత్రం ఇబ్బందులు లేవా? మరి గాయినెట్లా కడుతాండు? ఖాతా అంటె గట్లుండాలె గాని గిదేం బేరమయ్యా?- నాతోని గాదు- పాత బాకీ కట్టంది సౌదలు ఇయ్యా..."

ఆ పేద ఖాతాదారు దీనంగా అడిగి అడిగి... నిలబడి నిలబడి... ఫలితం లేక దిగులుగా వెళ్ళిపోయాడు-

జేబులోంచి సగం కాదు- ఆ నెల బాకీ మొత్తం తీసి ఇచ్చాడు మల్లేశం-


పొగిడే కళ్ళతో అతని వంక చూసి- ఒళ్ళంతా వినయం తొడుక్కొని కొట్టు యజమాని ఆ డబ్బులు తీసుకున్నాడు-

"అరేయ్- సార్‌కు కూల్ డ్రింక్స్ తేపో..." అని నౌకరును గెదిమే మర్యాదల దాకా పోయాడు-

ఒద్దని మల్లేశమే బయటికి వచ్చేశాడు. వచ్చి కర్చిఫ్‌తో మొహం తుడుచుకున్నాడు-

** ** **

"కిరాణా షాప్ వాండ్లు ఏమీ అనలేదు కదూ?- ప్రతి నెలా కరెక్ట్‌గా ఇస్తున్నాం కదా- ఈ ఒక్క నెలకు సగం ఆపితే ఏవీ అనరని నేను చెప్పలేదూ?"-



ఆ మాటలంటున్న భార్య వంక చూడలేక పోయాడు మల్లేశం- మొహం చాటు చేసుకున్నాడు-

గోడవైపు తిరిగి దుస్తులు మారుస్తూ - ''మొత్తం బాకీ ఇచ్చేశాను-'' అని చెప్పాడు.

''అలాగా...'' విచారంగా అన్నది భార్య-

''సగమే ఇచ్చి షాపు అతనితో మాటలు పడమంటావా? నా వల్ల కాదు......'' అని గబగబా బాత్‌రూం-వైపు నడిచాడు-

దీర్ఘంగా నిట్టూర్చింది విమల- ఇక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోనే చేరడానికి నిశ్చయించుకున్నది-

పొద్దుటి నుంచి అదోలా వుండి... భార్య లీవు పెట్టమని అడిగే సరికి... పావుగంట సేపటి దాకా వూగిసలాటలో పడిపోయాడు మల్లేశం.

అటు వారు రారు - ఇటు వారు దూరంగా పల్లెటూర్లో...

లీవు పెట్టాలనే వుంది - కాని ఆఫీసర్ అర్జెంట్ ఫైలు ఉదయమే నోట్ పుటప్ గుర్తుకొచ్చి ఆఫీసు మెట్ల వైపే మొగ్గు చూపాడు.

గుమ్మం దాకా సాగనంపి అతని కళ్లలోకి దీనంగా చూసింది.

''మీరు లేనిదే నేనెక్కడికీ కదలను...'' అని మూగగా చెబుతున్నాయి ఆమె కళ్లు...

మల్లేశం గుండె బరువెక్కింది. మనసు రెండు సగాలై - ఒక సగమే అతని వెంట నడిచింది.

అంత బరువైన కాయాన్ని అతని అడుగులు ఎన్నడూ మోయలేదు.

ఆ రోజు కూడా అరగంట ముందే ఆఫీసుకు చేరుకున్నాడు.

ఆ సమయానికి టేబుళ్లు తుడిచే ప్యూను కూడా ఆఫీసుకు రాడు.

తన సీటు చేరుకొని... దుమ్ము దులుపుకొని కూర్చున్నాడు. కర్చీఫ్‌తో మొహం అద్దు కుంటూ ఓ పౌడర్ సువాసనలు గుప్పుమన్నాయి.

షర్టు గుండీలు పెట్టి, కాళ్లకు చెప్పులు తొడిగి, కర్చీఫ్‌కు పౌడర్ అద్ది జేబులో పెట్టే భార్య మరోసారి కళ్లలో మెదిలి మల్లేశం లోని తడి మనసు కదిలి పోయింది. తాను కుర్చీలో బందీ అయినట్టు, తన చేతులకు కనిపించని బేడీలు వున్నట్టు అనిపించింది.

ఒక్కరొక్కరే కొలీగ్స్ వొస్తున్నారు. టైప్ మిషన్ టకటక శబ్దాలు కర్ణపుటాల్ని అదర గొడుతున్నాయి. ఆ రోజు ఆఫీసుకు వచ్చినట్టుగా లేదు. ఆఫీసే కలలోకి వచ్చినట్టుగా వుంది.

'ఈ రోజు లీవ్ పెట్టకూడదా?' దీనంగా అడిగిన భార్య మొహం ఫైలు పేజీ నిండా కనిపించి మల్లేశం చలించి పోయాడు. కలం కదల్లేదు - ఈ అర్జంట్ ఫైల్ లేకపోతే లీవు పెట్టేవాడే...

అంతలో ఆఫీసర్ గారు ఆఫీస్‌లో అడుగు పెట్టారు. అతని చిరునవ్వు జాలంలో, గాలంలో చిక్కుకపోయాడు మల్లేశం.

''ఫైల్ పుటప్ చేస్తున్నారా?''

''చేస్తున్నా సార్...''

''గుడ్...''

టక టక బూట్ల శబ్దం దూరమయింది. హమ్మయ్య ఎంత ప్రమాదం తప్పింది. లీవ్ పెట్టక పోవడమే మంచిదయింది. కుర్చీలోదిగబడి పోయాడు మల్లేశం - ఫైల్ తీసుకున్నాడు.

కాని - సగం మనసుతో కలం ముందుకు సాగ లేదు.

ఇంటి దగ్గర భార్య నొప్పులు పడుతున్నదేమో! తల పగిలి పోతోంది. నరాలు కాగిపోతున్నాయి - కళ్లలో మంటలు లేచాయి.

చివరికి గబగబా ఆ ఫైల్ పుటప్ చేసి హాప్ డే లీవ్ పెట్టి ఇంటికి వెళ్ళాలని నిశ్చయించు కున్నాడు. మల్లేశం మనసు కాస్త కుదుట పడింది.

వంచిన తల ఎత్తకుండా నోట్ రాయడంలో మునిగిపోయాడు.

టైప్ మిషన్ టకటకలు, ఆడ కొలీగ్స్‌ను నవ్వించేందుకు పక్క సీటు సుబ్బారావు పేల్చే జోకులు అతనికి వినిపించలేదు. చివరికి కరెంట్ పోయిన విషయం కూడా అతను గమనించ లేదు.

ఫ్యాన్‌లు ఆగి, ట్యూబ్‌లు మలిగిన ఆ సమయం ఎంతో సరదా సమయం. కళ్లు చికిలించి చూస్తూ ఆ గుడ్డి వెలుగులోనే నోట్ రాస్తున్నాడు మల్లేశం - కొత్తగా చేరిన టైపిస్ట్ మాలతి కూడా బయటకి నడుస్తూ మల్లేశంను వెర్రివాడు అను కుంది.

తిరిగి ఎప్పుడు కరెంటు వచ్చిందో ఎప్పుడు కొలీగ్స్ తమ సీట్లలోకి వచ్చారో తెలియదు మల్లేశంకు - తన పని తాను చేసుకుపోతున్నాడు

ఆ ఫైల్‌కు సంబంధించిన కొన్ని రిఫరెన్స్‌లు సుబ్బారావు ర్యాక్‌లో వున్నాయి.

ఆ ఫైల్ నంబర్ చెప్పి, వారపత్రిక చూస్తున్న సుబ్బారావును రిఫరెన్స్‌లు అడిగాడు మల్లేశం.

అసహనంగా కదిలాడు సుబ్బారావు ఇబ్బందిగా మొహం పెట్టాడు.

''అమ్మో! అంత పాత రిఫరెన్స్‌లా! ఎక్కడో అడుగున వుంటాయి - మీది ఫైళ్లన్నీ తీస్తే కాని దొరకవు. ఆ దుమ్మంతా దులిపి తీయడం నా వల్లకాదు. కావాలంటె బాలయ్యను పిలుస్తాను - చెప్పి తీయించుకోండి'' అన్నాడు.

ప్యూన్ బాలయ్యకు చెప్పడం కాదు - బతిమలాడాడు మల్లేశం.


''హయ్య బాబో - గవన్నీ ఇప్పుడెవలు తీస్తరు సార్! నా కవుతల పని వున్నది'' అని వెళ్లి పోయాడు బాలయ్య.

పాత రిఫరెన్స్‌లు దొరక్క, రాస్తున్న నోట్ ఆగిపోయింది. సమయం పన్నెండు కావస్తోంది. త్వరగా నోట్ రాసి ఆఫీసర్‌గారికి ఆ ఫైల్ అందిస్తే గాని తాను హాఫ్ డే లీవు పెట్టడానికి కుదర్దు.

''సుబ్బారావు... ప్లీజ్... కొంచెం మీరే తీసి ఇవ్వరూ... తొందరగా నోట్ పుటప్ చేసి హాఫ్ డే లీవ్‌పెట్టి వెళ్ళాలి - నా మిసెస్‌కు ఒంట్లో బాగా లేదు'' తిరిగి సుబ్బారావును వేడుకున్నాడు మల్లేశం.

''అలాంటప్పుడు ఫుల్ డే లీవ్ పెట్టాల్సింది. మీకు బోల్డు లీవులున్నాయి కదా అయినా రిజి స్టర్‌లోసంతకం చేశారు కదా... ఇక చెక్కెయ్యక లీవెందుకు?'' అన్నాడు సుబ్బారావు.

''జె.డి. అర్జంట్‌గా ఈ ఫైల్ పుటప్



చేయమన్నారు.

"ఆ ఆ అర్జంట్‌లు ఎప్పుడూ వుండేవే..." తేలికగా తీసి పడేశాడు సుబ్బారావు.

నిజానికి ఆ నోట్ పుటప్ చేయాల్సింది సుబ్బారావు అతడు నోట్ సరిగా రాయలేదు. అర్జంట్‌గా రాయలేదని మల్లేశంకు అప్పగించారు ఆఫీసర్.

మల్లేశం ఎఫిషియంట్ అండ్ సిన్సియర్ వర్కర్ ... అందుకే పక్క సీటు అర్జంట్ ఫైళ్లు కూడా అతని నెత్తిమీద పడుతుంటాయి.!!

మల్లేశం 'మంచివాడు' కనుక అదంతా ఆఫీసర్‌కు తన మీద వున్న నమ్మకంగా భావించి ఉబ్బి తబ్బిబ్బవుతాడు.

పక్క సీటు సుబ్బారావు వార పత్రికలు మాస పత్రికలు చదువుకుంటాడు.

సమయం పన్నెండుంబావు - క్షణ క్షణానికి మల్లేశం కూర్చున్న వైరు కుర్చీ ముళ్ల కుర్చీ అవుతున్నది. ఇక చేసేది లేక తానే సుబ్బారావు రాక్‌లోంచి రిఫరెన్స్‌లు వెదికి తెచ్చుకున్నాడు మల్లేశం.

"సారీ మల్లేశం! ఏమీ అనుకోకు నా కసలే దుమ్మంటె ఎలర్జీ తుమ్ములు అందుకే పాత ఫైళ్లు తీయలేక పోయాను" అన్నాడు సుబ్బారావు.

మల్లేశం ఏమీ, అనుకోలేదు నోట్ పుటప్ చేయడంలో మునిగిపోయాడు.

ఎదుటి సీటు వరద రాజమాత్రం మల్లేశం వంక జాలిగా చూశాడు.

నోట్ పూర్తయ్యే సరికి మరో గంట పట్టింది. సమయం రెండు కాబోతున్నది. లంచ్ కూడా చేయక - ఏకధాటిగా నోట్ పూర్తి చేశాడు మల్లేశం - అతని గుండెలో జపాన్ రైళ్లు పరుగెడుతున్నాయి. సగం మనసు కూడా అతణ్ని విడిచి ఇంటి దారి పట్టింది.

ఫైల్‌ను సూపరింటెండెంట్ సంతకం కోసం సాయంగా తీసుకెళ్ళాడు.

అప్పుడే కేంటిన్ నుంచి వచ్చినట్లున్నాడు సూపరింటెండెంట్! కొనని జర్దాపాన్ నములుతూ, కొనని సిగరెట్ తాగుతూ తన్మయత్వంలో వున్నాడు.

ఐదు నిమిషాల దాకా నుంచున్నాడు మల్లేశం

- అక్కడ పెట్టి వెళ్ళండి మల్లేశం గారు అన్లేదు - కనీసం అక్కడ పెట్టి వెళ్ళు మల్లేశం అన్లేదు సూపరింటెండెంట్.

చూసి చూసి ఫైల్ టేబుల్ మీద పెట్టి తన సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు మల్లేశం.

సూపరింటెండెంట్ సంతకం చేశాక, ఫైలు ఆఫీసర్ గారిని చేరితే తనకు విముక్తి...

గడిచే ప్రతి సెకను సూదిలా మల్లేశం గుండెను గుచ్చుతోంది. అతడు కూర్చోలేక పోతున్నాడు - ఆఫీసులో నుంచో లేక పోతున్నాడు... రక్తానికి బదులు అతని నరాల్లో ఆందోళన ప్రసరిస్తున్నది. అతని కళ్ళలో నొప్పులతో ఆయాస పడుతున్న భార్య కనిపిస్తున్నది. అతని చెవుల్లో ఆమె వేదన, రోదన గింగురుమంటున్నాయి.

అంతసేపు గుక్కెడు మంచినీళ్లు కూడా తాగకుండా నాలుగు గంటల మల్లేశం శ్రమించి రాసిన నోట్ సూపరింటెండెంట్ టేబుల్ మీద కునుకు తీస్తోంది.

రెండు దాటి పది నిమిషాలయింది ఇక కూర్చోలేక పోయాడు మల్లేశం—

సూపరింటెండెంట్‌ను సమీపించి "సర్ జె.డి. గారు ఈ ఫైల్ అర్జంటుగా పంపించమన్నారు" అని గుర్తు చేశాడు.

ఎగాదిగా అతని వంక ఒకసారి చూశాడు సూపరింటెండెంట్ సుబ్బారావు వంకనో, ముకుందం వంకనో, కడకు ప్యూన్ బాలయ్య వంకనో అలా చూసి వుంటే... మళ్లీ చూడడానికి ఆ సెక్షన్‌లో మిగిలేవాడు కాదు సూపరిండెంట్.

మల్లేశం మంచివాడు, గోవు కాబట్టి ఎట్లా చూసినా, మాట్లాడినా ప్రమాదమేం లేదు.

"సర్... జె.డి.గారు అర్జంటుగా..." మరోసారి అది తన సొంత ఫైల్ అయినట్టు ప్రాధేయపడ్డాడు మల్లేశం.

"ఊఁ..." కోపంగా ఆ ఫైల్ మీద ఓ సంతకం పడేశాడు సూపరింటెండెంట్.

ఆ ఫైల్ తీసుకుని ఆఫీసర్ దగ్గరికి వెళ్ళిన మల్లేశంకు అక్కడా నిరీక్షణే ఎదురయింది.

లోనికి వెళ్ళబోతున్న అతణ్ని ఆపి "సార్ బిజీగున్నడు" అని చెప్పాడు ప్యూన్.

ఆఫీసర్‌గారి గదిలో ఎవరున్నారు అని అడగ లేదు మల్లేశం — ఆఫీస్ హాలంతా ఒకసారి పరీక్షగా చూశాడు. అన్ని టేబుళ్ల మీదికి గెంతిన అతని చూపులు మోహిని సీటు దగ్గర ఆగిపోయాయి—

"లోపల మోహిని మేడం వున్నారా?"

అవునన్నట్టు తలూపాడు ప్యూన్ భారంగా నిట్టూర్చి వెను తిరిగాడు మల్లేశం.

"నేను అర్జంటుగా ఇంటికి వెళ్లాలి. హాఫ్ డే లీవు పెడ్తున్నాను. జె.డి.గారు బిజీగా వున్నారు. కొంచెం సేపైన తరువాత ఈ ఫైలు వారికి పంపిస్తారా?" సూపరిండెంట్‌ను వేడుకున్నాడు.

"నువ్వే ఇచ్చి వెళ్లు - ఇంకేమన్నా చెబుతాడేమో" అన్నాడు సూపరిండెంట్.

మల్లేశం మనసు కీడును శంకిస్తోంది. ఇంటి దగ్గర భార్య ఎలా వుందో ఏమో అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. భయంతో శరీరం వొణుకుతున్నది.

మరో పది నిమిషాలు గడిచాయి.

మోహిని బయటికి రాలేదు.

దబదబ ఆ గది తలుపు మీద బాదాలన్నంత కోపం వచ్చింది —

ఆ ఫైల్‌ను ఆఫీసర్ గారికి ఇచ్చి రమ్మంటె ప్యూన్ కదలడు - అర్జంట్ ఫైల్ అన్నా వదలడు -

చివరికి మల్లేశం ప్రయత్నం ఫలించి ఫైల్ తీసుకుని ప్యూన్ లోనికి వెళ్లాడు.


నిమిషంలోనే తిరిగి వచ్చేశాడు.

"ఇంకో గంటయినాక తీసుకు రమ్మన్నరు" అని చెప్పాడు.

గంటా!

తల గిర్రున తిరిగినట్లయింది మల్లేశంకు—

అర్జంట్... అర్జంట్ అన్న పెద్ద మనిషి ఆ ఫైల్ చూడక, ఇంటర్వ్యూ ఇవ్వక... గంటసేపు ఆగమంటాడా!...



నిజమే అర్జంట్ అనుకోని తనేంత హైరానా పడింది ఆఫీసర్ గారికేం తెలుసు!

ఆసుపత్రిలో చేరే పరిస్థితిలో వున్న భార్య లీవు పెట్టమని ప్రాధేయపడినా ఆ అర్జంట్ ఫైల్ కోసం ఆఫీసుకు వొస్తే ఫలితం ఇదా!!

గుండె రంపపు కోతకు గురైనా భరించి... కష్టపడి పాత రిఫరెన్స్‌లు వెదికి... ఫైల్ పూర్తి చేసి... అది తన టేబుల్‌కు సంబంధించిన ఫైల్ కాకపోయినా పూర్తి చేసి ఇంటికి పోకుండా ఇంకో గంటసేపు ఆగాలా!!

భారంగా కళ్లు మూసుకుని కణతలు నొక్కుకున్నాడు. గడిచే ఒక్కొక్క క్షణం అతని గుండె భారాన్ని పెంచుతున్నది.

అంతలో ప్యూన్ బాలయ్య వచ్చి చెప్పాడు ''సార్ మీకు ఫోన్ వొచ్చింది'' అని.

గుండె ఆగినంత పనయింది మల్లేశంకు. ఫోన్ దగ్గరికి నడుస్తుంటె అడుగులు తడబడుతున్నాయి. తల నుంచి ఆవిర్లు లేస్తున్నాయి.

వొణికే చేతుల్లో రిసీవర్ అందుకున్నాడు. అవతల ఇంటి ఓనర్ గొంతు వినగానే పంచ ప్రాణాలు పోయాయి. అతడు చెప్పిన వార్త వినగానే తల మీద పిడుగు పడినట్లయింది.

''మీ భార్యకు సీరియస్‌గా వుంది ఆసుపత్రికి తీసుకుపోయాం. డాక్టర్లు ఆపరేషన్ చేయాలంటున్నారు. మీరు వెంటనే రండి'' అది ఓనర్ చెప్పిన మాటల్లోని సారాంశం.

''ఇప్పుడే వొస్తున్నా'' అని ఫోన్ పెట్టేశాడు.

కంగారుగా సూపరిండెంట్‌ను సమీపించి ''నా భార్యకు సీరియస్‌గా వుందట వెంటనే వెళ్లాలి - ఈ ఫైల్ జె.డి. గారికి పంపించండి - ప్లీజ్'' అని చెప్పాడు.

''ఇచ్చి వెళ్లరాదూ?'' అన్నాడు సూపరిండెంట్.

''ఆయన బి.జీ.లో వున్నారు''

''ఓ పది నిమిషాలు ఆగరాదూ''

అవతల చావు బతుకుల్లో తన భార్య వుంటే పది నిమిషాలు పావు గంటలు ఆగాలా!! మల్లేశంలోని సహనాన్ని ఖూనీ చేస్తున్నారు. కోపంతో అతని ముక్కు పుటాలు అదురుతున్నాయి. కళ్ళు ఎరుపెక్కాయి.

''సారీ నేను అర్జంట్‌గా వెళ్లాలి ఇది ఫైలు, ఇది హాఫ్ డే లీవ్ లెటర్'' అని సూపరిండెంట్ టేబుల్ మీద పెట్టేసి గబ గబా అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు మల్లేశం.

బిత్తరపోయి చూశాడు సూపరిండెంట్ ఇప్పుడు తాము చూసింది మల్లేశం రూపాన్నే నని అతని కళ్లు నమ్మలేక పోయాయి. ఇప్పటి దాకా తాము విన్నది మల్లేశం గొంతునేనని అతని చెవులు నమ్మలేక పోయాయి.

మాలతి టకటక మిషన్ ఆగిపోయింది.

సుబ్బారావు ముకుందంలు నోళ్లు తెరచి చూస్తున్నారు.

** **

దాదాపు పరుగెత్తుతున్నట్టు నడుస్తున్నాడు మల్లేశం - బస్సు కోసం ఎదురు చూసే ఓపిక లేదు. ఆఫీసు దాటి చాలా దూరం వచ్చేశాడు. సమయానికి ఒక్క ఆటో దొరకదు.

ఇంకా ముందుకు వెళ్ళాడు - ఖాళీగా వున్న ఒక ఆటో కనిపించింది.

''రాంనగర్...'' అని ఆటోలో కూర్చోబోయాడు.

''లేదు సార్ - చార్మినార్ పైడైతే వొస్తా'' అన్నాడు ఆటో డ్రైవర్.

''జెర అర్జంట్‌గా వెళ్లాలి భాయ్ ప్లీజ్'' అని వేడుకున్నాడు మల్లేశం.

''మీరు డబుల్ ఛార్జీ ఇచ్చినా రాం అక్కడ రోడ్డు బాగా లేదు'' అని వెళ్ళిపోయాడు ఆటో డ్రైవర్ —

పిచ్చివాడిలా దాదాపు రోడ్డు వెంట పరుగెత్తుతున్నాడు మల్లేశం—

ఎలా తన భార్యను వెంటనే చేరుకునేది? ఎలా?... ఎలా??...

మరో ఆటో కనిపించింది.

ఆ ఆటోను అడిగితే ''నాంపల్లికైతే వొస్తా సార్'' అన్నాడు.

మల్లేశంకు ఎక్కడలేని ఆగ్రహం వచ్చింది. వున్మాదిలా వూగిపోతున్నాడు.

''మీ ఇష్టం వచ్చిన చోటికి పోతరా? మేం పోవాల్సిన చోటికి వస్తరా బే'' అని అతని గల్లా పట్టుకున్నాడు.

''ఏయ్ మర్యాదగా చేయి తీయి'' అని ఆటోవాలా బెదిరించాడు. అంతలో నాలుగైదు ఆటోలు అక్కడ మూగాయి.

ఆటో అతని బలగం పెరగడంతో గొంతు పెరిగింది — బలం పెరిగింది.

''నా మీద చేయి వేస్తవా'' అని మల్లేశం దవడ మీద ఈడ్చి కొట్టాడు - మల్లేశం ఆ ఆటో అతనిమీద కలయబడ్డాడు.

ఆ గుంపును చూసి పోలీసులు వచ్చారు వాళ్ళెప్పుడూ బలం గలవారి పక్షమే!

ఆటోవాలాలు చెబుతున్నది విని మల్లేశంను పట్టుకపోయారు.

అతను చెబుతున్నది వాళ్ళు వినిపించుకోలేదు - మల్లేశంకు మరింత మతిపోయింది.

''నన్ను వొదుల్తారా లేదా?'' అని గట్టిగా అరిచాడు.

''పాగల్ గానివా? పార్టీ గానివా? ఏమీ అట్ల అరుస్తవ్ ముందు స్టేషన్‌కు నడువు'' అని లాక్కుపోయారు పోలీసులు...

దీనంగా తనకోసం ఎదురుచూస్తున్న భార్య అతని కళ్లలో కనిపించింది. సీరియస్‌గా వుంది. హాస్పటల్‌లో వేశాం అన్న ఓనర్ మాటలు గుర్తుకొచ్చాయి.

చూసి చూసి తనను పట్టుకొని నడిపిస్తున్న పోలీసు డొక్కలో కుమ్మి తప్పించుకున్నాడు మల్లేశం... శక్తికొద్దీ పరుగెత్తుతున్నాడు... బలమంతా కూడ దీసుకుని పరుగెత్తుతున్నాడు.

ఎంత దూరం పరుగెత్త గలడు?

పోలీసులు వలపన్ని అతణ్ని పట్టుకున్నారు—

పోలీస్ మీద దాడిచేసిన తీవ్రమైన నేరానికి అతణ్ని లాకప్‌లో వేశారు...

ఆ చీకటి గదిలో కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు మల్లేశం...

అతని భార్య విమల బాల సూర్యుణ్ణి కన్న విషయం అతనికి తెలియదు!

